పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి



చెక్కులు అందుకున్న వారితో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర రూరల్: పేదల శ్రేయస్సే సీఎం కేసీఆర్ లక్ష్యమని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం లక్ష్మీపల్లిలో నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. మండలంలోని 160మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే సందర్శించారు. గ్రామంలోని పాఠశాలను మన ఊరు–మనబడి పథకం కింద ఎంపిక చేయాలని సర్పంచ్ కృష్ణారెడ్డి ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, వచ్చే విడతలో ఎంపిక చేసేలా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు జెట్టి నర్సింహా రెడ్డి, నాయకులు శ్రీకాంత్‌యాదవ్, ఉపసర్పంచ్ నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి..

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం నియోజకవర్గంలోని దేవరకద్ర, భూత్పూర్, చిన్నచింతకుంట ఒక్కో మండలానికి ముస్లింలకు ఉర్దూ ఘర్‌తో పాటు షాదీఖానా నిర్మాణానికి రూ.20లక్షల చొప్పున మంజూరైన ప్రొసిడింగ్‌లను అందజేశారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: మూసాపేట మండలానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాన్ని ఈనెల 23న నిర్వహించనున్నందున పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని అచ్చాయపల్లి శివారులో విభా ఆగ్రో సీడ్స్ కంపెనీలో సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. గురువారం ఆయన కంపెనీ వద్ద సమ్మేళన ఏర్పాట్లను పరిశీలించి స్థానిక నాయకులతో మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు ఇంద్రయ్యసాగర్, రాజశేఖర్ రెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, మండల అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహయాదవ్, కోఆప్షన్ మదీనా జమీర్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

మంత్రి శ్రీనివాస్‌గౌడ్



జిల్లా కేంద్రంలో మైనార్టీలకు రంజాన్ గిఫ్ట్ అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

స్టేషన్ మహబూబ్‌నగర్: మైనార్టీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పాలమూరు యూనివర్సిటీ ఎదురుగా ఉన్న హైటెక్ ఫంక్షన్‌హాల్‌లో మహబూబ్‌నగర్ మండలంలోని మైనార్టీలకు గురువారం మంత్రి రంజాన్ గిఫ్ట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం ద్వారా మైనార్టీల సంక్షేమానికి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో హజ్‌హౌజ్ నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే రూ.128 కోట్లతో మైనార్టీ గురుకుల సముదాయాన్ని నిర్మిస్తున్నామని వెల్లడించారు. అనంతరం జిల్లా కేంద్రం టీడీగుట్టలోని బిలాల్ మజీద్‌లో టీఆర్‌ఎస్ నాయకుడు మోసిన్‌ఖాన్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో మంత్రి, ముస్లిం నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, ముడా డైరెక్టర్ ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

ఈద్గా వద్ద ఏర్పాట్ల పరిశీలన

రంజాన్ పండుగ సందర్భంగా జిల్లా కేంద్రంలోని రహెమానియా ఈద్గా వద్ద జరిగే ప్రార్థనల కోసం ప్రభుత్వం తరపున జరుగుతున్న ఏర్పాట్లను గురువారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పరిశీలించారు. రంజాన్ పండుగ రోజు ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

వంట కార్మికులకు అండగా ఉంటా..

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): వంట కార్మికులకు అండగా ఉంటానని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం స్థానిక వీరన్నపేట్‌లోని జాంద్ర కమ్యూనిటీ హాల్‌లో వంటకార్మికుల సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వంటకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ పాల్గొన్నారు.

హన్వాడ: రాష్ట్ర ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డలకు అండగా నిలుస్తూ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ అందిస్తున్నట్లు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. గురువారం మండలంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పర్యటించారు. కొత్తపేటలో ముస్లింలకు ప్రభుత్వం తరపున రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని రైతువేదిక కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వంద మంది చెంచులకు దుప్పట్లు, వంట సామగ్రి, శానిటేషన్ కిట్లను మంత్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బాల్‌రాజు, జెడ్పీటీసీ విజయనిర్మల, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్ గౌడ్, వైస్ ఎంపీపీ లక్ష్మి, ఎంపీడీఓ ధనుంజయ గౌడ్, తహసీల్దార్ బక్క శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం

మిడ్జిల్: మండల కేంద్రంలో 2009 పదో తరగతి విద్యార్థులు ఏర్పాటు చేసిన రెండు చలివేంద్రాలను ఎంపీపీ సుదర్శన్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గౌస్, నాయకులు బాలు, అల్వాల్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రాజేశ్వర్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగు శిబిరం పరిశీలన



జడ్చర్ల టౌన్: శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన అద్దాలను ఇవ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి తెలిపారు. గురువారం 13వ వార్డు గౌడ ఫంక్షన్‌హాల్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. శిబిరానికి వచ్చిన వారితో కంటి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కమిషనర్ మహమూద్‌షేక్, కౌన్సిలర్లు నందకిశోర్‌గౌడ్, కోట్ల ప్రశాంత్‌రెడ్డి, శ్రీశైలమ్మ, మార్కెట్ డైరెక్టర్ వెంకటేశ్‌రెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణాలకు నిధులు మంజూరు

మిడ్జిల్: మండలంలోని వాడియాలులో ముస్లింల శ్మశానవాటిక ప్రహరీకి రూ.10లక్షలు, వెలుగొమ్ములలో ప్రహరీకి రూ.15లక్షలు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి నిధులు మంజూరు చేసినట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాండుయాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



తుంకినీపూర్‌లో మాట్లాడుతున్న సీఐ రజితారెడ్డి

అడ్డాకుల: గ్రామాల్లో ఎలాంటి అలజడులకు తావివ్వకుండా ప్రజలందరూ శాంతియుతంగా ఉండాలని భూత్పూర్ సీఐ రజితారెడ్డి అన్నారు. మూసాపేట మండలం తుంకినీపూర్‌లో గురువారం రాత్రి పోలీసుశాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. భూత్పూర్ సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐలు విజయభాస్కర్, మాధవరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మోహన్‌బాబు గ్రామంలోని ఇళ్ల వద్ద తనిఖీలు చేపట్టారు. పత్రాలు లేని 12 ద్విచక్రవాహనాలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. వాహనదారులు పత్రాలను తెచ్చి వాటిని తీసుకెళ్లాలని పోలీసులు సూచించారు. అదేవిధంగా గ్రామంలో పోలీసు కళాజాత ప్రదర్శన నిర్వహించారు. మూఢ నమ్మకాలు, మహిళల భద్రత, సైబర్ నేరాల నియంత్రణ, బాల్య వివాహాలు వంటి వాటిపై పోలీసులు ఆటా పాటలతో గ్రామస్తులను చైతన్యం చేశారు. ఈ సందర్భంగా సీఐ రజితారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిబంధనలు పాటించాలి



మిడ్జిల్: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్ సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకుంటే నేరాలను నియంత్రించవచ్చని, ఇంట్లో విలువైన వస్తువులు ఉంచవద్దని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, పర్వతాచారి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన



జడ్చర్లలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న వీఓఏలు

జడ్చర్ల: ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె గురువారం 4వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ వీఓఏల వేతనాలను పెంచుతామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహిళా సంఘాల బలోపేతానికి వీఓఏలు కృషి చేస్తున్నారని, వారి సేవలకు ప్రతిఫలంగా వేతనాలను రూ.26వేల వరకు పెంచాలని అన్నారు. అర్హులైన వీఓఏలను సీసీలుగా నియమించాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక ఎంపీడీఓ ఉమాదేవికి అందజేశారు. కార్యక్రమంలో వీఓఏలు రమాదేవి, వసియాబేగం, సరిత, గౌతమి, అలివేలు, కల్పన, యాదమ్మ పాల్గొన్నారు.

నవాబుపేట: తమ డిమాండ్లు సాధించే వరకు పోరాటం ఆగదని వీఓఏలు స్పష్టం చేశారు. వీఓఏల నిరసన కార్యక్రమాలు గురువారం నల్లవ రోజుకు చేరుకున్నాయి. కాంగ్రెస్ నాయకులు వీరికి మద్దతు తెలిపారు. కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆంజనేయులు, డాక్టర్ మీనాక్షి, వీఓఏల సంఘం నాయకులు అనిత, సాయిలు, రాములు, జయమ్మ, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

దూషించడం సరికాదు

మిడ్జిల్: ప్రభుత్వ అధికారులతో సమన్వయంతో పనిచేయించుకోవాలే తప్పా దూషించడం సరికాదని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాలవర్ధన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిడ్జిల్ ఎస్‌ఐని దూషించడం సరికాదని, జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని అన్నారు. సమావేశంలో శ్రీనునాయక్ తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

గండేడ్: మండలంలోని వెన్నాచేడ్‌లో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన వాటర్‌ట్యాంకుకు మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని గ్రామస్తుల ఫిర్యాదు చేయగా, మిషన్ భగీరథ అధికారులు గురువారం గ్రిడ్ ఎస్సీ వెంకటరమణ ఆధ్వర్యంలో గ్రామంలో పరిశీలించారు. సమస్య పరిష్కరించి నీళ్లు అందివ్వాలని సిబ్బందికి సూచించారు. పైపులైన్ చెక్‌చేసి నీళ్లను అందిస్తామని సర్పంచ్ పుల్లారెడ్డికి సూచించారు. కార్యక్రమంలో ఈఈ పుల్లారెడ్డి, పరిగి ఈఈ చెల్మారెడ్డి, డీఈ తేజ్‌బాబు, ఏఈ గణేష్ ఉన్నారు.

ముమ్మరంగా వరికోతలు



అప్పంపల్లిలో కల్లంలో కుప్పలుగా కవర్లు కప్పి ఉంచిన వరిధాన్యం

చిన్నచింతకుంట: ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తూ వస్తుంది. యాసంగి వరిపంట చేతికి రావడంతో రైతులు కోతలు ముమ్మరం చేశారు. కాగా, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో అకాల వర్షాలు కురిస్తే పంట నేలపాలు కావాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు 9,387 ఎకరాల్లో వరిసాగు చేశారు. దాదాపుగా 19,700టన్నుల వరిధాన్యం దిగుబడి రానున్నట్లు అధికారులు చెబుతున్నారు. రైతులు ఇప్పటికే వరికోతలను ముమ్మరం చేసి 60శాతం పూర్తి చేశారు. ప్రస్తుతం ధాన్యాన్ని ఆరబెట్టి కల్లాలలో కుప్పలుగా ఉంచారు. వర్షం కురిస్తే ధాన్యం తడిసే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో కొందరు రైతులు చేసేది లేక దళారులను ఆశ్రయిస్తున్నారు. దళారులు ఇదే అదునుగా చూసుకొని తక్కువ ధరలకే కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారు. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

మహబూబ్‌నగర్ రూరల్: జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి బ్యాగరి వెంకటస్వామి దళితరత్న అవార్డు అందుకున్న సందర్భంగా టీడీపీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ మెట్టుకాడి శ్రీనివాస్ గురువారం స్థానిక రెవెన్యూ భవనంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీసీ మహాసభ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మెట్టుకాడి శ్యామ్, టీడీపీ దేవరకద్ర నియోజకవర్గ ఇన్‌చార్జ్ జనార్దన్, లక్ష్మయ్య, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సిములు, జాతీయ కౌన్సిల్ సభ్యులు మోహిత్, దామోదర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



శాఖాపూర్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్‌లో గురువారం బీఆర్‌ఎస్ నాయకులు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మండలంలోని పెద్దవాగులో శాఖాపూర్, రాచాల గ్రామాల వద్ద రెండు చెక్‌డ్యాంల నిర్మాణానికి సీఎం కేసీఆర్ నిధులు విడుదల చేయడంతో హర్షం వ్యక్తం చేశారు. పెద్దవాగులో నిర్మించే చెక్‌డ్యాంలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు జితేందర్ రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు జయన్నగౌడ్, శ్రీకాంత్, రైతుబంధు అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, కోఆప్షన్ ఖాజాషెహరీ, ఆలయ చైర్మన్ రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గిరివికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



బోరుమోటారును పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ యాదయ్య

కోయిల్‌కొండ: మండలంలో గిరివికాసం పథకాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ యాదయ్య అన్నారు. గురువారం మండలంలోని కాన్గుబండతండా, హనుమాన్‌గడ్డ తండాల్లో గిరివికాసం పథకంలో భాగంగా ఎంపికైన లబ్ధిదారుల పొలాల్లో నీటిబోరును, విద్యుత్‌ను పరిశీలించారు. అనంతరం ఉపాధి హామీ పనులను పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాములు, ఎంపీఓ శ్రీదేవి, ఏపీఓ నర్సయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రతి కూలీకి పనికల్పించేలా చర్యలు



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణారావు

బాలానగర్: ఉపాధిహామీలో జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి పని కల్పించేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ కృష్ణారావు ఆదేశించారు. గురువారం మండలంలోని వాయిల్‌కుంట తండాలో గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను ఆయన పరిశీలించి కూలీలకు ఏర్పాటు చేస్తున్న వసతులపై ఆరా తీశారు. తాగునీటి వసతి, టెంట్ ఏర్పాటు, నిర్దిష్ట పనివేళలు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ తదితర అంశాలపై కూలీలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు నర్సరీలను పరిశీలించారు. కార్యదర్శి బాసు ఉన్నారు.

పౌష్టికాహార పంపిణీలో నిర్లక్ష్యం తగదు



గుడ్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి

మహమ్మదాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం తప్పనిసరిగా అందించాలని, లేదంటే చర్యలు తప్పవని ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని రాంకొండ కాలనీ, బీసీ కాలనీల్లో అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. రాంకొండ కాలనీలో అంగన్‌వాడీ టీచర్ లేకపోవడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ఆయా కూడా లేకపోవడంతో గ్రామంలోని మూడు సెంటర్లలో కనీసం ఒక్క ఉపాధ్యాయురాలైనా చూసుకోవడం లేదా అని ప్రశ్నించారు. బీసీ కాలనీ సెంటర్లో నీళ్లచారు, ఉడికీ ఉడకని అన్నం పెట్టడంతో మీ ఇంట్లో ఇలాగే వండుకుంటారా అని టీచర్, ఆయాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నారులకు అందించే పౌష్టికాహారం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలపై ఫిర్యాదు

మహమ్మదాబాద్: పిల్లల ఆరోగ్యం, సంసార జీవితం చక్కగా సాగేందుకు ఇంట్లో పూజలు చేస్తామంటూ నమ్మించి గుప్తనిధులు తవ్విన సంఘటన గండేడ్ మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఆశిరెడ్డిపల్లికి చెందిన వడ్డె లక్ష్మికి చౌదర్‌పల్లికి చెందిన పూజారి వెంకటయ్యతో పరిచయమైంది. కొన్ని రోజుల అనంతరం ఆమెతో సన్నిహితంగా ఉన్న ఆయన నీ పిల్లల ఆరోగ్య విషయమై, ఇంట్లో సంసార జీవితం మంచిగా ఉండేందుకు పూజలు చేద్దామని నమ్మబలికాడు. బుధవారం గుండుమాల్‌కు చెందిన గొటికె పాండు, రాములు, మొకర్లాబాద్ గ్రామానికి చెందిన గొల్ల మణ్యంలు తమ ఇంట్లో పూజలు చేస్తామంటూ గుప్తనిధుల కోసం తవ్వారంటూ గురువారం లక్ష్మి పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మహమ్మదాబాద్ ఎస్‌ఐ సైదయ్య తెలిపారు.

నేడు మార్కెట్‌లో లావాదేవీలు

దేవరకద్ర: స్థానిక మార్కెట్‌లో శుక్రవారం యధావిధిగా లావాదేవీలు కొనసాగుతాయని అధికారులు పేర్కొన్నారు. గురువారం అమావాస్య కారణంగా మార్కెట్‌కు సెలవు ఇచ్చారు. తిరిగి శుక్రవారం మధ్యాహ్నం ఈనామ్ టెండర్ల ద్వారా ధాన్యం కొనుగోలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం యాసంగి సీజన్ కింద పండిన వరిధాన్యంతో పాటు, ఆముదాలు మార్కెట్‌కు అమ్మకానికి వస్తున్నాయి.

మే నుంచి పెరిగిన ధరలు అమలు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ట్రాయ్ నిబంధనల ప్రకారం పెరిగిన ధరలు మే నెల నుంచి అమల్లోకి వస్తాయని, కేబుల్ కనెక్షన్లు కలిగిన వినియోగదారులు నిరంతర ప్రసారాల కోసం పెరిగిన ధరలు చెల్లించి కేబుల్ ఆపరేటర్లకు సహకరించాలని కేబుల్ ఆపరేటర్ల అసోసియేషన్ అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో కేబుల్ ఆపరేటర్ల సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు.

ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని కోడూర్ శివారులో గల బొంతనేలా గుట్ట వద్ద పనిచేస్తున్న ఉపాధి కూలీలకు సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌గౌడ్ గురువారం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణయ్య, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ కవిత, ఫీల్డ్ అసిస్టెంట్ చెన్నయ్య, ఆశావర్కర్ లక్ష్మి పాల్గొన్నారు.

డబ్బులు జమచేయండి

మిడ్జిల్: రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం త్వరలో ప్రారంభం అవుతుందని పశువైద్యాధికారిణి శ్రావణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లబ్ధిదారులు తమ వాటా కింద రూ.43,750లు కలెక్టర్ ఖాతాలో ఆన్‌లైన్ ద్వారా జమ చేయాలని సూచించారు. మొత్తం యూనిట్ విలువ రూ.లక్షా 75వేలు ఉంటుందని, అందులో 20 గొర్రెలు, ఒక్క పొట్టేలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఘనంగా జన్మదిన వేడుకలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు జన్మదిన వేడుకలను గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో నాయకులు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, చంద్రశేఖర్ రెడ్డి, బాలప్ప, మురళి, చెన్నయ్య, గట్టు రాములు తదితరులు పాల్గొన్నారు.


బహిరంగ సభను విజయవంతం చేయండి

గండేడ్: బీజేపీ ఆధ్వర్యంలో ఈనెల 23న చేవెళ్లలో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర కిసాన్‌మోర్చ ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ కోరారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు కార్యకర్తలు కార్యక్రమానికి తరలిరావాలని వెన్నాచేడ్‌లో నిర్వహించిన సమావేశంలో పిలుపునిచ్చారు. బీజేపీ చేపడుతున్న అభివృద్ధి, పథకాల గురించి కేంద్ర మంత్రి అమిత్‌షా హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో మండల అధ్యక్షుడు ప్రభునాయక్, నాయకులు శ్రీనివాస్, మైపాల్‌గౌడ్, ఆశన్నగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నర్సింహులు, శ్రీను, బాలయ్య, గంగానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిమొక్కను బతికించుకోవాలి

గండేడ్: మండలంలోని గ్రామాల్లో గల నర్సరీలో పెంచుతున్న ప్రతి మొక్కను బతికించి హరితహారానికి సిద్ధం చేయాలని ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని వెన్నాచేడ్‌లో నర్సరీల్లో మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను తప్పకుండా బతికించుకోవాలని సూచించారు. అలాగే పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని తెలిపారు.

సీపీఎస్ ఉద్యోగుల ఇఫ్తార్



ఇఫ్తార్‌లో పాల్గొన్న సీపీఎస్ ఉద్యోగులు, ముస్లింలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక కార్యాలయంలో ఇఫ్తార్ నిర్వహించారు. రంజాన్ మతసామరస్యానికి ప్రతీక అని సంఘం జిల్లా అధ్యక్షుడు సనాతన బాలస్వామి అన్నారు. కార్యక్రమంలో గోవర్ధనాచారీ, రాఘవేంద్ర, ఇనాయత్, రాఘవేందర్‌రెడ్డి, ఖాదర్, హుస్సేన్, వెంకటయ్యగౌడ్ పాల్గొన్నారు.

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని మసీదులో గురువారం రాత్రి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వేణుగోపాల్, రాధాకృష్ణరెడ్డి, శ్రీనివాస్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

రాజాపూర్: ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యతని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ప్రమాదాల నివారణ కోసం ఎస్‌బీఐ సహకారంతో సీఎస్ఆర్ నిధులు రూ.2.6లక్షలతో ఏర్పాటు చేసిన స్టాపర్స్‌ను ఆయన పోలీసులకు అందించారు. అంతేకాకుండా ఎస్‌బీఐలో ఖాతాదారులు రూ.వెయ్యి చెల్లించి రూ.20లక్షల బీమాను చేయించుకోవాలన్నారు. అనంతరం ఆర్ఎం శ్రవణ్‌కుమార్, బ్రాంచ్ మేనేజర్ మధువాణికి ఎస్ఐ వెంకట్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ నాగార్జున, క్యాషియర్ శ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అర్ధనగ్న దీక్ష

కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని గురువారం 89వ రోజు జేఏసీ నాయకులు అర్ధనగ్న దీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ మండల కన్వీనర్ రామునాయక్, కోకన్వీనర్ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ మూడు నెలలుగా గార్లపహాడ్‌ను మండలంగా చేయాలని దీక్షలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు వెంకటేష్, ఖాజ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కానుక పంపిణీ



జడ్చర్ల టౌన్: పట్టణంలోని ఫజల్‌బండ మదీనా మసీదులో గురువారం ప్రభుత్వం అందజేసిన రంజాన్ కానుకలను కమిటీ అధ్యక్షుడు మహ్మద్ మొయిజొద్దీన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చైతన్య, రహీమొద్దీన్, మసీదు ఉపాధ్యక్షుడు మినాజొద్దీన్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రషీద్, కమిటీ బాధ్యులు గౌస్‌మొహియొద్దీన్, సయ్యద్ ఇక్బాల్ పాల్గొన్నారు.

రంజాన్ కిట్ల పంపిణీ

దేవరకద్ర: మండలంలోని బస్వాపూర్‌లో గురువారం ముస్లింలకు రంజాన్ కిట్లను సర్పంచ్ హన్మంతు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేష్, మైనార్టీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బొటానికల్ గార్డెన్ సందర్శించిన విద్యార్థులు



జడ్చర్ల టౌన్: పట్టణంలోని బొటానికల్ గార్డెన్‌ను గురువారం మహబూబ్‌నగర్‌లోని తెలంగాణ గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు 36మంది సందర్శించారు. వారికి గార్డెన్ సమన్వయకర్త సదాశివయ్య వివరాలు తెలిపారు. గార్డెన్‌తో పాటు బయో డైవర్సిటీ రీసెర్చ్‌ల్యాబ్, హెర్బేరియం గురించి అవగాహన కల్పించారు. జంతుశాస్త్ర విభాగంలో నిర్వహిస్తున్న వర్మీ కంపోస్ట్‌ను విద్యార్థులు తిలకించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.అప్పియాచిన్నమ్మ, అధ్యాపకులు శ్రీనివాసులు, రమాదేవి, రాహుల్, వీరాంజనేయులు పాల్గొన్నారు.

హాజీకి సన్మానం

జడ్చర్ల టౌన్: ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం జిల్లా ఆటో యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజుగాని అశోక్ ఆధ్వర్యంలో నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ హాజీని శాలువాతో సత్కరించారు. ఇటీవల ఓ ఆటోలో కానిస్టేబుల్ తన బ్యాగును మర్చిపోవడంతో హాజీ బ్యాగు రికవరీకి సహకరించాడు. కార్యక్రమంలో ముడా డైరెక్టర్ శ్రీకాంత్, ఆటో యూనియన్ నాయకులు నర్సింగ్, శ్రీను, ఖాజా, మహేష్, సంజయ్, రాజేష్ పాల్గొన్నారు.

అమావాస్య ప్రత్యేక పూజలు



కోయిల్‌కొండ: మండలంలోని ప్రసిద్ధి చెందిన శ్రీరామకొండ క్షేత్రంపై చైత్ర అమావాస్య సందర్భంగా గురువారం స్వయంభుగా వెలసిన శ్రీరామపాదానికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకుడు రాఘవేందర్‌రావు తెలిపారు. స్వామివారిని ప్రత్యేకపూలతో అలంకరించి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించినట్లు తెలిపారు.

చండీహోమం..

జడ్చర్ల టౌన్: మండల కేంద్రంలోని దేవునిగుట్టతండా సమీపంలోని శ్రీగిరిక్షేత్రం అష్టలక్ష్మి ఆలయంలో గురువారం అమావాస్యను పురస్కరించుకుని చండీహోమం నిర్వహించారు. ఆచార్య కృష్ణస్వామి ఆధ్వర్యంలో డీటీసీ డీఎస్పీ రామారావు నాగవేణి, సంజయ్ మాధవి, నర్సింహులు పుణ్యవతి దంపతులు హోమం చేపట్టారు.

